కొండెక్కిన టమోటా..

- నెల కిందట రూ.28 ఉండగా.. ప్రస్తుతం రూ.80కి చేరిన ధర
- దిగుబడి తగ్గడమే కారణం
- మదనపల్లి మార్కెట్ నుంచి దిగుమతి
- సామాన్యుడిపై పడుతున్న ఆర్థిక భారం

పార్వతీపురంటౌన్:

టమోటా ధరలు మరోసారి కొండెక్కాయి. సాధారణంగా ఈ సీజన్‌లో టమోటా ఒక్కో బాక్స్ ధర రూ.500లోపే ఉంటుంది. కానీ ఈ సంవత్సరం ఎన్నడూ లేనివిధంగా రికార్డ్ స్థాయిలో ధరలు పలుకుతున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా దేశవ్యాప్తంగా టమోటా దిగుబడి తగ్గడమే ఇందుకు కారణమని పలువురు వ్యాపారులు అంటున్నారు. గత 20 రోజుల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళలో టమాటా ధరలు పెరిగి కిలోకు రూ.50 వద్ద స్థిరపడ్డాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో కిలో టమాటా ధర రూ.80కి పైగా ఉంది. రైతుబజార్‌లో రూ.68లకు విక్రయిస్తుండగా, బయట మార్కెట్‌లో కిలో రూ.75 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. ఎండాకాలంలో విపరీతమైన ఉష్ణోగ్రతల వల్ల టమాటో సాగు తగ్గిందని రైతులు చెపుతున్నారు. జిల్లాలో కూరగాయల పంటలు సరిగ్గా పండకపోవడంతో మదనపల్లి మార్కెట్ మీద ఆధారపడాల్సి వస్తోందని వ్యాపారులు అంటున్నారు. మరో నెల రోజుల పాటు ధరలు ఇలానే ఉండే అవకాశం ఉందని, వర్షాలు జోరందుకుంటే ధరలు దిగివచ్చే అవకాశం ఉందని అంటున్నారు.


రైతుబజారులో టమోటా విక్రయాలు

పేద, మధ్య తరగతి వారిపై భారం

అసలే పెరిగిన నిత్యావసర ధరలతో పేదలు, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. దానికి తోడు వంటల్లో విరివిగా ఉపయోగించే టమాటా ధర రూ.80కి చేరడం, ఉల్లి ధర బహిరంగ మార్కెట్‌లో రూ.50కి చేరుకోవడంతో సామాన్యులపై ఆర్థిక భారం మరింత పెరిగింది. నిత్యావసరాల ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాలని సామాన్యులు కోరుతున్నారు.

రాయితీపై అందించాలి



టమోటాతో పాటు ఉల్లి, ఇతర కూరగాయ ధరలు పెరిగిపోయాయి. సామాన్యులు కూరగాయలు కొనుగోలు చేయలేని పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం రైతు బజారుల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు రాయితీపై టమోటాలు విక్రయించాలి. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– మణి, పార్వతీపురం పట్టణం

కొనాలంటే భయంగా ఉంది



టమోటాలు కొనాలంటే భయంగా ఉంది. మాలాంటి పేద మధ్య తరగతి కుటుంబాలు ప్రస్తుతం కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చొరవ చూపి రైతు బజారులో రాయితీపై విక్రయాలు చేపట్టాలి. ఇదే అదను గా కొందరు వ్యాపారులు పూటకో రేటు పెంచే సి విక్రయిస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టిసారించాలి.

– రమణమ్మ, పార్వతీపురం పట్టణం

రైతు బజారులో రూ.68కే..



జిల్లాలో పంట దిగుబడి సరిగా లేకపోవడంతో మదనపల్లి నుంచి టమోటాను దిగుమతి చేస్తున్నాం. ప్రభుత్వం ఆదేశిస్తే రైతు బజారుల్లో రాయితీపై పంపిణీకి చర్యలు చేపడతాం. ప్రస్తుతం రైతుబజార్లలో రైతుల ద్వారా అమ్మకాలు చేపడుతున్నాం. ప్రస్తుతం రైతు బజారులో కిలో టమోటా రూ.68కే విక్రయిస్తున్నాం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సంజ్యున, ఎస్టేట్ అధికారి, పార్వతీపురం

అనధికార లేఅవుట్‌లో రోడ్ల తొలగింపు

పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీలోని రెండోవార్డు సచివాలయం పరిధిలో ఉన్న సౌందర్యనారాయణ మూర్తి నగర్‌లో అనధికార లేఅవుట్‌లో వేసిన రోడ్లను బుధవారం సాయంత్రం జేసీబీ సాయంతో తొలగించినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారి పి.కనకారావు తెలిపారు. సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు లేకుండా కొందరు అక్రమంగా లేఅవుట్ వేశారు. దీనిపై సంబంధిత యజమానులకు నోటీసులు అందజేసినా పట్టించుకోకపోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు లేఅవుట్ రోడ్లను తొలగించినట్లు చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా కొత్తగా లేఅవుట్లు వేసేవారు తప్పనిసరిగా టౌన్‌ప్లానింగ్ అనుమతులు తీసుకోవాలని సూచించారు.


రోడ్లు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు అన్యాయమే..

- రిపబ్లికన్ పార్టీ స్టేట్ సెక్రటరి గొంప ప్రకాశరావు

సాలూరు: కేంద్ర బడ్జెట్ పేదలు, దళితులు, ముస్లి మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందని రిపబ్లికన్ పార్టీ స్టేట్ సెక్రటరీ గొంప ప్రకాశరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. టీడీపీ కూటమి మద్దతుతో కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదా ఊసెత్తకుండా రూ.15 వేల కోట్లు అప్పు ఇస్తామనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మరోవైపు బీహార్‌కు అప్పుగా కాకుండా కేంద్ర ప్రభుత్వ గ్రాంటుగా నిధులు కేటాయించడాన్ని టీడీపీ, జనసేన నాయకులు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి నిధుల కేటాయించకపోవడంపై గిరిజన ఎంపీలు ప్రశ్నించకపోవడం దురదృష్టకరమన్నారు.

బోధనా నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి

- ఆర్జేడీఎస్ఈ బి.విజయభాస్కర్

పార్వతీపురంటౌన్: ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ ఎస్ఈ బి.విజయభాస్కర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రపంచ బ్యాంకు సహకారంతో ఎస్సీఈఆర్టీ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టీచ్ టూల్ శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతులను ఆర్జేడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయుల్లో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థి కేంద్రంగా బోధనా పటిమను తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణా కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై రిసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, డీవైఈఓ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ ఎస్ఈ బి.విజయభాస్కర్

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

పాలకొండ: మండలంలోని కొండాపురంలో సచివాలయ సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వీధుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ మృతికి సంతాపం

సాలూరు రూరల్: నరసాపురం ఎంపీడీఓ వెంకటరమణ మృతిపై ఉన్నత స్థాయిలో విచారణ చేపట్టాలని, ఆయన మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ సిబ్బంది డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వెంకటరమణ మృతికి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువయ్యాయని వాపోయారు. ఉద్యోగులు స్వేచ్ఛగా విధులు నిర్వహించే వాతావరణం కల్పించాలని కోరారు. ఎంపీడీఓ వెంకటరమణ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై సీఐడీతో విచారణ చేయించాలని ఎంపీడీఓ ఫణీంద్రకుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

సీతానగరం: నరసాపురం ఎంపీడీఓ వెంకటరమణ మృతికి స్థానిక మండల పరిషత్ ఉద్యోగులు సంతాపం తెలియజేశారు. బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. వెంకటరమణ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈశ్వరరావు, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, ఉపాధిహామీ పథకం ఏపీఓ భాను, ఈసీ కృష్ణ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధిహామీ పథకం సిబ్బంది, పీఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: నరసాపురం ఎంపీడీఓ వెంకటరమణ మృతికి స్థానిక మండల పరిషత్ సిబ్బంది సంతాపం తెలియజేశారు. బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి మౌనం పాటించారు. స్థానిక ఎంపీడీఓ అబీబ్ జావేద్, పాలకొండ, సీతానగరం, గరుగుబిల్లి మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


పార్వతీపురం టౌన్: నల్ల బ్యాడ్జీలు ధరించి సంతాపం తెలుపుతున్న మండల పరిషత్ అధికారులు, సిబ్బంది


సాలూరు రూరల్: వెంకటరమణ చిత్రపటం వద్ద నివాళి అర్పింస్తున్న మండల పరిషత్ సిబ్బంది


సీతానగరం: సంతాపం తెలియజేస్తున్న మండల పరిషత్ సిబ్బంది

అంకితభావం తప్పనిసరి

- న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

పాలకొండ రూరల్: విధి నిర్వహణలో అంకితభావం అవసరమని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ డ్రైవర్లపై ఉన్న నమ్మకంతో బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తారన్నారు. వారి నమ్మకం ఒమ్ము చేయకూడదని సూచించారు. ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం ఇవ్వకుండా వాహనాలను నడపాలన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగి వ్యక్తిగత, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. నూతన చట్టాల ప్రకారం రోడ్డు ప్రమాదాలకు కారకులైన వారిపై నమోదు చేయబడే కేసులు, వాటి తీవ్రత, అనుభవించాల్సిన శిక్షలపై న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యులు పల్లా మునిస్వామి, మరిచర్ల జగన్‌మోహనరావు, బి.రామ్మోహనరావు, ఎం.వెంకటేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరావు, ఇతర ఆర్టీసీ అధికారులు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.


ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

పాలకొండ రూరల్: సర్కారు అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులు అందిపుచ్చుకుని సమాజంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నాక్ బృంద సభ్యులు స్పష్టం చేశారు. రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొలువుదీరిన బృందం కళాశాలలో గ్రీన్‌బోర్డ్స్, డిజిటల్ తరగతి గదులు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, తదితర అంశాలను బుధవారం క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. విద్యాప్రమాణాల సంతృప్తి స్థాయిపై ఆరాతీసి సానుకూలంగా స్పందించారు. మాతృభాష తెలుగుతో పాటు ఆంగ్లం కూడా తప్పనిసరిగా నేర్చుకోవాలని బృందసభ్యులు హేమలత బాగ్లా, మేరియాన ఫెర్నాండైజ్, జోషఫ్ లోనస్, తదితరులు తెలిపారు. కళాశాల అభివృద్ధికి నాక్ తరఫున సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు, ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, జయమణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

తోటల వేలం రేపు

పార్వతీపురంటౌన్: తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ ఏరియా వద్ద ఉన్న కొబ్బరి, జీడి, మామిడి చెట్ల ఫలసాయం అనుభవించేందుకు ఈ నెల 26న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పాటదారులకు 1 జూలై 2024 నుంచి 30 జూన్ 2027 వరకు అనుభవ హక్కులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఈఓపీఆర్డీగా జీవీ రమణ


బాధ్యతలు స్వీకరిస్తున్న జీవీ రమణ

పార్వతీపురంటౌన్: మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న జీవీ రమణమూర్తికి ఈఓపీఆర్డీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై పారిశుధ్య పక్షోత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.

మాజీ సర్పంచ్ మృతి


కోట సింహాచలం (ఫైల్)

సీతానగరం: మండలంలోని అంటిపేట మాజీ సర్పంచ్ కోట సింహాచలం బుధవారం మృతి చెందారు. ఆయన 1987 –94 మధ్య కాలంలో అంటిపేట పంచాయతీ సర్పంచ్‌గా అంటిపేట, వెన్నెల బుచ్చింపేట, వెంకటాపురం గ్రామాల ప్రజలకు సేవలందించారు. ఆయన మృతికి పంచాయతీ ప్రజలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు సంతాపం తెలియజేశారు.

పీహెచ్‌సీకి నూతన వైద్య పరికరాలు


వైద్య పరికరాలను పరిశీలిస్తున్న ఎంపీపీ నాగమణి, జడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: బలిజిపేట పీహెచ్‌సీకి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం, అమరావతి నుంచి సుమారు రూ.8 లక్షల విలువైన పరికరాలను సరఫరా చేశారు. గతంలో పంపించిన ప్రతిపాదనల మేరకు వారు పరికరాలను ఉచితంగా పంపినట్లు తెలిసింది. ఎంపీపీ నాగమణి, జడ్పీటీసీ రవికుమార్ బుధవారం వాటిని పరిశీలించారు. ఏయే పరికరాలు వచ్చాయి, వాటి ఉపయోగం ఏంటి? తదితర వివరాలను పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతి కిరణ్మయిని అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షలు చేసేందుకు అవసరమైన కిట్లు, ఫర్నీచర్, ల్యాబ్‌కు సంబంధించిన మెటీరియల్ వచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు.

కూలిన ఇంటి గోడ

గుమ్మలక్ష్మీపురం: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని వంగర గ్రామానికి చెందిన కె.రుకునమ్మ ఇంటి గోడ బుధవారం కూలిపోయింది. ఆ సమయానికి ఆమె అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తనకంటూ ఎవరూలేరని, నెల నెలా వచ్చే పింఛన్‌తోనే జీవనం సాగిస్తున్నానని, అధికారులు స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ


దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న ఐఈఈసీ కోఆర్డినేటర్ భానుమూర్తి

మక్కువ: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఐఈసీట కోఆర్డినేటర్ పెంట భానుమూర్తి బుధవారం ఫిజియోథెరిపీ నిర్వహించారు. చిన్నారులతో ఇంటి వద్ద చేయించాల్సిన వ్యాయామాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా వ్యాయామ చికిత్స అందించడం వల్ల మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చిన్నచూపు చూడకుండా సాధారణ పిల్లల వలే చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పెంట సత్యనారాయణ, భవిత కేంద్రం సిబ్బంది శైలజ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం కీడవాయి గ్రామానికి చెందిన బిడ్డిక బంపన్న(60) బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న బంపన్నను కుటుంబ సభ్యులు హుటాహుటిన మొండెంఖల్లు పీహెచ్‌సీకి తీసుకెళ్లగా.. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రగిరి సీహెచ్‌సీకి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వృద్ధుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

మక్కువ: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ పి.దేవకుమార్ అన్నారు. మండలంలోని చెముడు, పనసభద్ర, కవిరిపల్లి పంచాయతీల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మురుగునీరు నిలిచిపోకుండా కాలువల్లో పూడికలు తీయించడం, బ్లీచింగ్ చల్లించడం, తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించడం వంటి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి ర్యాలీ చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు.


పనసభద్రలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

సంధ్యారాణిని మంత్రి పదవి నుంచి తొలగించాలి

- గిరిజన సంఘాల నాయకుల డిమాండ్

సాలూరు రూరల్: గిరిజన శాఖామంత్రిగా బాధ్యతలు చేపడుతూ.. గిరిజనేతరులకు ప్రాధాన్యత ఇస్తున్న గుమ్మిడి సంధ్యారాణిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని గిరిజన సఘాల నాయకులు పాలక రంజిత్‌కుమార్, పల్ల సురేష్, ఇంటికుప్పల రామకృష్ణ, ఆరిక చంద్రశేఖర్, చెల్లూరి సీతారాం, జట్ల బంగార్రాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఏకలవ్య పాఠశాలలో రెగ్యులర్ సిబ్బందిని నియమించడంతో కాంట్రాక్ సిబ్బందిని తొలగించారని, ఉద్యోగాలు కోల్పోయిన గిరిజనులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత గిరిజన శాఖామంత్రిపై ఉందన్నారు. వారికి తక్షణమే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు కాకుండా గిరిజనేతరుల సంక్షేమానికి మంత్రి సంధ్యారాణి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.


విలేకరులతో మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

‘పొలం బడి’ అమలుకు సన్నాహం

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్ పాల్



పార్వతీపురంటౌన్: సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ‘పొలంబడి’ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ అన్నారు. ఇందులో భాగంగా ‘ఉత్తమ సాగు మెలకువల’ పై వ్యవసాయ అధికారులు, సహాయకులకు బుధ వారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది గరుగుబిల్లి మండలం సంతోషపురంలో ఉత్తమ సాగు పద్ధతులను తెలియజేసేలా ‘పొలంబడి’ నిర్వహించామన్నారు. ఈ సారి విత్తనం నాటిన నుంచి పంట చేతికి వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు అనుసరించి ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 15 మండలాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించనున్నామని వెల్లడించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో చిరుధాన్యాల ఉత్పత్తి, మిగిలిన మండలాల్లో వరి సాగుపై పొలం బడి నిర్వహించనున్నామన్నారు. రైతులు వ్యక్తిగతంగా పొలంబడిలో చేరితే రూ. 1100, రైతు సంఘం ద్వారా చేరితే రూ.100 చెల్లిస్తే సరిపోతుందన్నారు. 30 మంది రైతులు సంఘంగా ఏర్పడి పొలం బడిలో చేరితే ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు ఆదా అవుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఊపందుకున్న ఊబాలు


వరినాట్లు వేస్తున్న మహిళా రైతులు

సీతానగరం: మండలంలో గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పాటు సీతానగరం ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయని, ఇప్పటివరకు 720 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ తెలిపారు. అంటిపేటలో బుధవారం పర్యటించారు. లైన్ ప్లాంటేషన్ విధానంలో వరినాట్లు వేస్తున్న పొలాన్ని పరిశీలించారు. లైన్ ప్లాంటేషన్, మిషన్ ప్లాంటేషన్, డ్రమ్ సీడర్‌తో నాట్లు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. లైన్ ప్లాంటేషన్ వల్ల మొక్కలకు తగినంత గాలి, వెలుతురు అందుతుందని, తద్వారా మొక్కలు దుబ్బుకట్టి దిగుబడి పెరుగుతుందన్నారు. అంటిపేట గ్రామాన్ని సీడ్ విలేజ్‌గా గుర్తించామని, ఇక్కడ పండించే వరి పంట నుంచి విత్తనాలు తయారు చేయడం జరుగుతుందన్నారు. నాణ్యమైన పంట దిగుబడులు సాధించేలా రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ సిబ్బంది రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జగదీష్, దివ్యశ్రీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని కోటసీతారాంపురం, తామరఖండి, దయానిధిపురంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ బుధవారం పరిశీలించారు. కాలువల్లో పూడికలు తొలగించి, దోమల నివారణకు మలాథియాన్ మందును స్ప్రే చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు ఈఓపీఆర్డీ కుమారవర్మ చెప్పారు. వీధుల్లో చెత్త వేయొద్దని, ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.


కె.ఎస్.పురంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న కార్యదర్శి కామేశ్వరరావు

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

- డిప్యూటీ డీఈఓ కృష్ణారావు


పాలకొండ రూరల్: మంగళాపురంలో విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు


సీతంపేట: విద్యార్థినులను పరిచయం చేసుకుంటున్న, డీడీ అన్నదొర

పాలకొండ రూరల్: జాతీయ విద్యావిధానం ద్వారా విద్యార్థులు తమలో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను ప్రాజెక్టుల రూపంలో బయట పెట్టాలని డిప్యూటీ డీఈఓ పి.కృష్ణారావు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు గాను బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా గొట్ట మంగళాపురం, చిన మంగళాపురం, గోపాలపురం, తదితర గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి, వాటి ఆవశ్యకతను అడిగి తెలుసుకున్నారు.

క్రీడాస్ఫూర్తి పెంపొందించుకోవాలి..

సీతంపేట: విద్యార్థినుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర కోరారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ పి.నారాయుడు, ఏఎంఓ పి.కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, జీసీడీఓ రాములమ్మ, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, హెచ్ఎం పి.పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యూఓ పి.అమల, తదితరులు పాల్గొన్నారు.